నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
ఆదివారం
10-08-2025
పేజీలు: 02




## సృష్టి కేసులోకి ఈడీ ఎంట్రీ

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులోకి ఈడీ ఎంట్రీ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో కేసు వివరాలు ఇవ్వాలంటూ హైదరాబాద్ పోలీసులకు ఈడీ అధికారులు లేఖ రాశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లో డాక్టర్ నమ్రత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చైల్డ్ ట్రాఫికింగ్ ద్వారా ఆమె రూ. కోట్లు సంపాదించినట్లు సమాచారం. మొత్తం 86 మంది పిల్లలను చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడినట్లు డాక్టర్ నమ్రతపై ఆరోపణలు ఉన్నాయి. సరోగసీ పేరుతో అక్రమంగా పిల్లల వ్యాపారం చేసినట్లు ఈడీ అనుమానాలు వ్యక్తం చేసింది. సుమారు రూ.40 కోట్ల మేర హవాలా రూపంలో లావాదేవీలు జరిగినట్లు అనుమానిస్తున్నారు. కాగా, విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




## ఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలు వాయిదా

ఈ నెల 13 నుంచి జరగాల్సిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (CGL) పరీక్ష వాయిదా పడింది. సెప్టెంబర్ మొదటి వారంలో పరీక్షలను నిర్వహిస్తామని, పూర్తిస్థాయి ఎగ్జామ్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని కమిషన్ ప్రకటించింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, సంస్థలలో మొత్తం 14,582 ఖాళీల భర్తీకి ఎస్ఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టైర్-1 పరీక్షలు ఆగస్టు 13 నుంచి 30 వరకు జరగాల్సి ఉన్నాయి. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో పరీక్షలను వాయిదా వేసింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణలో మార్పులు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సూచించింది.



# బీజేపీలో చేరిన గువ్వల బాలరాజు



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భారతీయ జనతా పార్టీలో చేరారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు సమక్షంలో ఆదివారం నాడు గువ్వల బాలరాజు కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. న్యాయవాదిగా సేవలు అందించిన గువ్వల బాలరాజు చిన్న వయసులోనే ఎమ్మెల్యే అయి అట్టడుకు వర్గాల వారికి సేవ చేశారని, వారి అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. గువ్వల బాలరాజు అచ్చంపేట నియోజకవర్గానికే కాదు తెలంగాణ అభివృద్ధిలో భాగం కావాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడిన గువ్వల... బీజేపీలో తన జర్నీని సామాన్య కార్యకర్త మాదిరిగా ప్రారంభిస్తానని చెప్పారు. దేశ రక్షణలో, అవినీతి రహిత సమాజం కోసం పోరాడుతున్న బీజేపీలో సామాన్య కార్యకర్తగా ఉంటానని చెప్పారు. గత రెండు దశాబ్దాలు నిబద్ధన కలిగిన కార్యకర్తగా బీఆర్ఎస్ పార్టీలో పని చేశానని.. అదే స్ఫూర్తిని బీజేపీలోనూ కొనసాగిస్తానని చెప్పారు. తాను పార్టీ మారటానికి అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. కార్యకర్తలకు చెప్పకుండా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినందుకు అచ్చంపేట ప్రజలకు క్షమాపణలు చెబుతున్నానని అన్నారు.తాను ఇలా చేయటానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు ముందే తెలిస్తే.. బీఆర్ఎస్ ప్లాన్ బీ అమలు చేసి తన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందన్న కారణంతోనే ఎవరికీ చెప్పకుండా రిజైన్ చేసినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో తనకు చాలా ఏళ్లుగా పరిచయం ఉందని.. ఆయన తాను నమ్మిన సిద్ధాంతం కోసం అలుపెరగకుండా పోరాటం చేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తిని తాను కొనసాగిస్తాని గువ్వల వెల్లడించారు.

### కేటీఆర్ పై గువ్వల బాలరాజు సంచలన వ్యాఖ్యలు

కేటీఆర్ పై గువ్వల బాలరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ నాకంటే పెద్దోడేమీ కాదని పేర్కొన్నారు బాలరాజు. విదేశాల్లో చదువుకుని ఉండొచ్చు కానీ.. నాకు ఉన్న అనుభవం కేటీఆర్ కు లేదని నేను భావిస్తున్నా అని బాంబు పేల్చారు గువ్వల బాలరాజు.ఆకలి కేకలను వినిపించడం మొదలుపెడితే గ్రామాల్లో కేటీఆర్ ను అడుగుపెట్టనివ్వను అని వార్నింగ్ ఇచ్చారు గువ్వల బాలరాజు. కాగా గువ్వల బాలరాజుకు షాక్ ఇచ్చారు BRS కార్యకర్తలు.త మను సంప్రదించకుండా ఎలా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తావని గువ్వలపై ఎదురుతిరిగారు ఆయన అనుచరులు. గువ్వల తన నివాసంలో సమావేశం పెట్టగా, అంతంత మాత్రంగా వచ్చారు కార్యకర్తలు. గువ్వల నిర్ణయానికి వ్యతిరేకంగా ఒక ఫంక్షన్ హాల్‌లో సమావేశం పెట్టుకున్నారు అనుచరులు, కార్యకర్తలు.

## అంతర్జాతీయ వేదికపై మెరిసిన యువ సంచలనం

**పడిగ తేజేష్**

సౌత్ కొరియాలో జరుగుతున్న 20వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ — 2025 లో భారత యువ ప్రతిభ మరోసారి మెరిసింది. హైదరాబాద్‌కు చెందిన పడిగ తేజేష్ మూడు విభిన్న విభాగాల్లో పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. జూలై 24 నుంచి 30వ తేది వరకు జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్‌షిప్‌లో, తేజేష్ పెయిర్ స్కేటింగ్ విభాగంలో రజత పతకం సాధించారు. క్వార్టెట్ స్కేటింగ్‌లోనూ మరో సిల్వర్ మెడల్ అందుకున్నారు. అంతేకాక, షో గ్రూప్ స్కేటింగ్‌లో అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.ఈ విజయాలతో తెలుగు యువ కెరటం అంతర్జాతీయ వేదికపై మెరిసింది. యువతలో స్ఫూర్తిని నింపుతున్న పడిగ తేజేష్ దేశ కీర్తిని మరింత పెంచారు. భారత క్రీడల చరిత్రలో మరో కీలక అధ్యాయాన్ని లిఖించిన ఈ విజయాలు... దేశం మొత్తానికీ గర్వకారణం.




## రచ్చ లేపిన రుక్సార్ ధిల్లన్

టాలీవుడ్‌లో ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ తమ అందచందాలతో ఆకట్టుకుంటున్నారు. అలాంటి వారిలో రుక్సార్ ధిల్లన్ ఒకరు. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన కృష్ణార్జున యుద్ధం సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అందాల ముద్దుగుమ్మ.ఈ సినిమాతో ఈ చిన్నదానికి మంచి మార్కులు పడ్డాయి.ఈ సినిమాలో అందం అభినయంతో ఆకట్టుకున్న ఈ వయ్యారి భామ. కృష్ణార్జున యుద్ధం సినిమాకంటే ముందు ఆకతాయి అనే సినిమాలో నటించింది. ఆ తర్వాత శిరీష్ హీరోగా నటించిన ఏబీసీడీ సినిమాలో నటించి మెప్పించింది రుక్సార్ ధిల్లన్. తన అందంతో కవ్వించింది రుక్సార్.ఆతర్వాత విశ్వక్ సేన్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. అశోకవనంలో అర్జున కల్యాణం సినిమాతో హిట్ అందుకుంది. ఆతర్వాత స్పార్క్ సినిమాలో నటించి మెప్పించింది ఈ అందాల భామ.



## దేశ వ్యాప్తంగా రాఖీ సంబరాలు

అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండగను దేశవ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిజేస్తున్నారు పలువురు ప్రముఖులు. "ఈ ప్రత్యేకమైన రాఖీ పండుగ సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు" అని ఎక్స్ లో పోస్ట్ చేశారు ప్రధాని మోదీ. . కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ, "సోదర సోదరీమణుల మధ్య ఉండే విడదీయరాని ప్రేమ, విశ్వాసం, రక్షణ అనే బంధానికి అంకితమైన పవిత్రమైన పండుగ 'రక్షాబంధన్' సందర్భంగా దేశప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో



ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు. మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా 'ఎక్స్' ద్వారా తన శుభాకాంక్షలు తెలియజేశారు.





## హుస్సేన్‌సాగర్‌లో వరద ఉధృతి.. కాలనీలకు అధికారుల అలర్ట్!

హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా హుస్సేన్‌సాగర్‌కు వరద నీరు భారీగా చేరుతోంది. నగరంలోని నీటి మార్గాలు, నాలాలు పొంగిపొర్లుతుండటంతో సమీపంలోని పలు కాలనీలు జలమయమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమైన చర్యలు చేపట్టారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా సూచనలు జారీ చేశారు. కవాడిగూడ, గాంధీ నగర్, అరవింద్ నగర్, సబర్మతి నగర్‌లలో నివసించే ప్రజలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ అయ్యాయి. నాలాలకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతాలు వరద ముంపు బారిన పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. రాత్రివేళల్లో వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో, నివాసితులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం స్థానిక అధికారులు, పోలీసు విభాగాలు సిద్ధంగా ఉన్నాయి. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు హుస్సేన్‌సాగర్ వద్ద నీటి మట్టాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. నీటి ఉధృతిని బట్టి గేట్లను తెరిచి నీటిని నియంత్రితంగా విడుదల చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అయినప్పటికీ, నగరంలోని తక్కువ ఎత్తు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షం ఆగకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని అధికారులు కోరారు. విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలపై కూడా వర్షం ప్రభావం పడుతుండటంతో, నగరవాసులు జాగ్రత్తగా ఉండాలని



సూచించారు. అత్యవసర సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# శనివారం రాత్రి హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

భాగ్యనగరాన్ని శనివారం రాత్రి కూడా భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరం అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ మీదుగా నగరంలోకి వచ్చే మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.శనివారం సాయంత్రం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, నాగోల్, ఉప్పల్, ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్ వంటి శివారు ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాదర్‌గుల్‌లో 80 మి.మీ., హయత్‌నగర్‌లో 75 మి.మీ. చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.ఈ భారీ వర్షానికి సైదాబాద్‌లోని రెడ్డి కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు బయటకు రాలేక తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భాగ్యలత వద్ద కూడా రోడ్డుపై నీరు నిలవడంతో వాహనాలు నత్తనడకన కదిలాయి.నగరంలోని సికింద్రాబాద్, తార్నాక, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కోఠి, అబిడ్స్ సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో వర్షం ప్రభావం చూపింది. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. సమాచారం అందుకున్న అధికారులు, సహాయక చర్యలు చేపట్టి, వరద నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.



# ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు

తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలి విడతలో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి 3,500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఈ ఇళ్లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. వీలైనంత వరకు పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి.. ఆగస్టు 15 నాటికి పెద్ద ఎత్తున గృహప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటున్నారు. 360 డిగ్రీలో అభ్యర్థుల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే.. అర్హులుగా తేలిన వారిని ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయిస్తున్నారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని చోట్ల అనర్హులకు ఇళ్లు మంజూరవుతున్నాయి. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ వార్త సంచలనంగా మారింది. ఒకే కుటుంబంలో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారనే వార్తపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆ వివరాలు.. ఖమ్మం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారనే వార్త సంచలనంగా మారింది. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్



నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తొలి విడతలో ఇళ్లు మంజూరైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా లాభం లేదని.. అధికారులు దీనిపై స్పందిచడం లేదని.. తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎవరైనా దీనిపై స్పందించి విచారణ చేపట్టాలని.. నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొన్ని రోజుల క్రితం హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు 1950 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ వెరిఫికేషన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1,950 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తించారు. దీంతో అధికారుల వారి ఇళ్లను రద్దు చేశారు. మరోవైపు శాఖపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు. వీరందరికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని.. అప్పుడు నిర్మాణం చేపట్టలేదని అధికారులు తెలిపారు. తొలి విడత రూ.లక్ష చెల్లించే సమయంలో వీరి గురించి తెలిసిందని.. అందుకే వెంటనే వీరికి కేటాయించిన ఇళ్లను రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మరి ఇప్పుడు ఒకే కుటుంబంలోమ 5గురు ఇందిరమ్మ ఇళ్లను పొందారన్న దానిపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.



## తెలంగాణలో వంద ఎకరాల్లో
# డ్రై పోర్టుకు ప్లాన్

మహబూబ్‌నగర్ జిల్లాను పారిశ్రామికంగా.. ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా నుంచి వలసలను అరికట్టడానికి.. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడానికి డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడి.. అడ్డాకుల మండలం గుడిబండలో డ్రై పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ డ్రై పోర్టు వల్ల జిల్లా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

డ్రై పోర్టు ఏర్పాటు, అనువైన ప్రాంతం..

గుడిబండ గ్రామంలోని సుమారు 100 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని డ్రై పోర్టు ఏర్పాటు కోసం పరిశీలిస్తున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) అధికారులు, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి ఈ స్థలాన్ని సందర్శించారు. గుడిబండ ప్రాంతం డ్రై పోర్టుకు ఎంతో అనుకూలమైనదని వారు గుర్తించారు. ఇది నేషనల్ హైవే-44కు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్‌తో పాటు కర్నూలు, బెంగళూరు మార్గాలకు దగ్గరగా ఉండటం దీనికి అదనపు బలం. అలాగే.. కర్ణాటకలోని రాయచూర్‌కు వెళ్లే జాతీయ రహదారి-167కు సమీపంలో ఉండటంతో రవాణా చాలా సులభంగా ఉంటుంది. డ్రై పోర్టుల వల్ల సముద్ర ఓడరేవుల నుంచి వచ్చే సరుకులను రైలు, రోడ్డు మార్గాల ద్వారా సురక్షితంగా నిల్వ చేసి, సమయానికి గమ్యస్థానాలకు చేరవేయవచ్చు. దీనివల్ల ఓడరేవుల్లో రద్దీ తగ్గుతుంది. ఖర్చు, సమయం ఆదా అవుతాయి. పాలమూరు జిల్లాలో ఇలాంటి పోర్టు వస్తే.. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకుంటాయి.

## ఆ యువతితో రాఖీ కట్టించుకొని..
# పుకార్లకు చెక్ పెట్టిన సిరాజ్



ఇంగ్లాండ్ పర్యటనలో అద్భుతంగా బౌలింగ్ చేసిన టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఒక నెల రోజులు బ్రేక్ తీసుకున్నాడు. ఈ బ్రేక్ ను తన కుటుంబ సభ్యులతో గడుపుతూ ఎంజాయ్ చేస్తున్నాడు. సిరాజ్ రాఖీ పండుగను జరుపుకున్నారు. ఓ యువతి సిరాజ్ కు రాఖీ కట్టి పుకార్లు చెక్ పెట్టింది. గాయని ఆశా భోస్తే మనవరాలు జనై భోస్లేతో సిరాజ్ ప్రేమాయణం నడిపిస్తున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ గా మారాయి. ఈ వార్తలు ఒకే ఒక పండగ ఫుల్ స్టాప్ పెట్టింది. రాఖీ పండగ సందర్భంగా సిరాజ్ కు జనై భోస్లే రాఖీ కట్టింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సిరాజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయగా ఆశా కూడి ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఒక పాత ఫొటోను పట్టుకొని సిరాజ్, ఆశా మధ్య ప్రేమాయణం నడుస్తోందని సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేశాయి. ఈ ఫొటో వైరల్ కావడంతో పాటు ఐపిఎల్ మ్యాచ్ సిరాజ్ ఉన్న జట్టుకు ఆశా మద్దతు తెలపడంతో పుకార్లకు మరింత బలం చేకూరింది. రాఖీ కట్టిన వీడియోను పోస్టు చేయడంతో పాటు ఇంతకంటే గొప్పది తాను కోరుకోవడం లేదని, నా ప్రియమైన అన్నయ్య అని సంబోధించింది. తన చెల్లి లాంటి వారు ఎవరూ లేరని సిరాజ్ పోస్టు చేశారు. దీంతో ఇద్దరు మధ్య అన్నచెల్లెల అనుబంధం ఉందని తెలిసిపోయింది.



# తెలంగాణ ప్రజలకు హైఅలర్ట్



తెలంగాణను కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత వారం పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు దంచికొడుతున్నాయి. ఈ భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణా, గోదావరి నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్ జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు కూడా వరద పోటెత్తింది. హుస్సేన్ సాగర్ కూడా నిండు కుండలా మారింది. ఈ జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మొత్తంగా తెలంగాణ రాష్ట్రాన్ని వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ వర్షాలు ఇలానే వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఆగస్టు 14 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా వానలు దంచికొట్టే అవకాశం ఉందని తెలంగాణ వెదర్‌మ్యాన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో కూడా ఆగస్టు 14 నుంచి 17 వరకు వానలు దంచికొట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ నాలుగు రోజుల్లో ఒకట్రెండు రోజులు మాత్రం అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## బోల్డ్ ఫోజులతో
# ప్రగ్యా జైస్వాల్

హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ మరోసారి గ్లామర్ ట్రీట్‌తో అదరగొట్టారు. బ్లాక్ డ్రెస్‌లో ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోస్ వైరల్ అవుతున్నాయి. క్యూట్ మెస్మరైజింగ్ లుక్స్‌తో యూత్ మనసు దోచేలా అందాలు ఆరబోశారు ప్రగ్యా. 'ప్రేమలో మునిగిపోయింది' అంటూ క్యాప్షన్ ఇవ్వగా లవ్, ఫైర్ సింబల్స్‌తో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తాజాగా గ్లామర్ ఫోటో షూట్స్‌లో మెరుస్తున్నారు ప్రగ్యా. ఆమె స్టన్నింగ్ ఫోజులు ఆకట్టుకుంటున్నాయి. 'కంచె' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ఫస్ట్ మూవీతోనే మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. బాలయ్య 'అఖండ'తో మరింత క్రేజ్ సంపాదించుకున్నారు. లేటెస్ట్‌గా బాలకృష్ణ 'డాకు మహారాజ్'లో నటించగా... ప్రస్తుతం ఇతర ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు.




## కృష్ణానగర్‌లో కొనసాగుతున్న
# సినీ కార్మికుల నిరసన

టాలీవుడ్‌లో వారం రోజులుగా సినీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కృష్ణానగర్‌లో ఇవాళ సినీ కార్మికుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో 24 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు. టిజి విశ్వప్రసాద్ తీరుపై నిరసన వ్యక్తం చేయడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను ఫెడరేషన్ ప్రకటించనుంది. నిర్మాతలు సూచించిన పర్సెంటేజీ విధానాన్ని ఫెడరేషన్ అంగీకరించలేదు. యూనియన్లను నిర్మాతలు విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఫెడరేషన్ ఆరోపణ చేసింది.